

అటా.. ఇటా..?

గూడూరుపై తొలగని అస్పష్టత



- వెంకటగిరి మండలాలను ఎటు కలుపుతారు?
- నగరి మొత్తం తిరుపతిలోకేనా?
- జిల్లాల పునర్విభజనపై అదే అనిశ్చితి

ఇంతకీ గూడూరు జిల్లా అవుతుందా.. లేక నెల్లూరు జిల్లాలో కలుస్తుందా? వెంకటగిరి ఎటు ఉంటుంది? నగరి నియోజకవర్గం మొత్తం అటా.. ఇటా?

ఈ ప్రశ్నలకు బుధవారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలోనూ సమాధానాలు లభించలేదు. అస్పష్టత యధాతధంగా కొనసాగుతోంది. ప్రజల ఆకాంక్షలు, ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు సహా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏమవుతాయనే సందేహాలు మిగిలిపోయాయి.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

గూడూరు.. నెల్లూరు జిల్లాలోకి

గూడూరు నియోజకవర్గాన్ని అక్కడి ప్రజల కోరిక మేరకు నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని గతేడాది ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతకు ముందే యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ సైతం గూడూరు ప్రజలకు అదే విధమైన వాగ్దానం చేశారు. వీటిని దృష్టిలో పెట్టుకుని చూస్తే ప్రస్తుత మంత్రివర్గ ఉపసంఘం కూడా గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపేందుకు సానుకూలంగా ప్రతిపాదించే అవకాశముంది. అయితే అక్కడ ఇటీవల వినిపిస్తున్న గూడూరు జిల్లా ఏర్పాటు మాత్రం లేనట్టే భావించాలి.

వెంకటగిరి ఎటు?

వెంకటగిరి నియోజకవర్గంలో ఆరు మండలాలుండగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో కలిపిన గత ప్రభుత్వం మిగిలిన కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విభజన పరిపాలనా పరంగా అసౌకర్యం కలిగిస్తున్న నేపధ్యంలో నియోజకవర్గాన్ని పూర్తిగా అటు నెల్లూరులోనో లేక ఇటు తిరుపతి జిల్లాలోనో కలపాల్సిన అవసరం ఏర్పడింది. వెంకటగిరి నుంచీ నెల్లూరుకు 82 కిలోమీటర్ల దూరం కాగా తిరుపతికి 50 కిలోమీటర్లు. ఈ విషయంలోనూ మంత్రివర్గ ఉపసంఘం ఓ నిర్ణయానికి రాలేదు.

నగరి మొత్తం తిరుపతిలోకే!

నగరి నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం రెండు జిల్లాల నడుమ విభజించి అసౌకర్యానికి, అయోమయానికి కారణమైంది. నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కొనసాగించిన గత ప్రభుత్వం మిగిలిన పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో కలిపింది. ఇది పాలనాపరమైన సమస్యలకు దారి తీసింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నగరి నియోజకవర్గం మొత్తాన్నీ తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు చిత్తూరు కలెక్టర్ సైతం నగరి, నిండ్ర, విజయపురం మండలాలను చిత్తూరు నుంచీ తొలగించి తిరుపతి జిల్లాలోనే కలపాలని సిఫారసు చేశారు. స్థానిక ఎమ్మెల్యే అభిప్రాయాన్ని, చిత్తూరు కలెక్టర్ నివేదికను దృష్టిలో వుంచుకుని చూస్తే మంత్రివర్గ ఉపసంఘం నగరిని పూర్తిగా తిరుపతిలో కలిపే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదించాల్సి వుంది. కాకపోతే దీనిపైనా ఇప్పటి దాకా ఒక నిర్ణయం తీసుకోలేదు.

రెవెన్యూ డివిజన్లలో మార్పులు

గూడూరును నెల్లూరులో కలపడం తప్పనిసరి కానుంది కాబట్టి రెవిన్యూ డివిజన్ల పరంగా మార్పులు అనివార్యం కానున్నాయి. ఇప్పటి వరకూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు గూడూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో వున్నాయి. గూడూరు తిరిగి నెల్లూరులో విలీనమైతే వెంకటగిరికి చెందిన మూడు మండలాలను శ్రీకాళహస్తి రెవిన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రతిపాదించారు. అలాగే నగరి నియోజకవర్గం పూర్తిగా తిరుపతిలో విలీనమైతే నగరి రెవిన్యూ డివిజన్ ఈ జిల్లా పరిధిలోకి వస్తుంది. గూడూరును కోల్పోయే పక్షంలో నగరి డివిజన్ ఆ లోటును భర్తీ చేయనుంది. మొత్తం మీద జిల్లాలోని నాలుగు డివిజన్ల సంఖ్య యధాతధంగా వుంటుంది.

నాయుడుపేట జిల్లా సాధ్యం కాదు

నాయుడుపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి, మంత్రివర్గ ఉపసంఘానికి వినతులు అందినట్టు సమాచారం. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం జిల్లా యంత్రాంగం అభిప్రాయాన్ని కోరిందని సమాచారం. అయితే నాయుడుపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు ఆచరణ సాధ్యం కాని ప్రతిపాదనగా పేర్కొంటూ జిల్లా యంత్రాంగం నివేదిక ఇచ్చినట్టు తెలిసింది.

నగర పంచాయతీలుగా వరదయ్యపాలెం, సత్యవేడు

జిల్లాలో ఇప్పటికే తిరుపతి కార్పొరేషన్‌తో పాటు శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ఆరు మున్సిపాలిటీలున్న సంగతి తెలిసిందే. వీటికి మరో రెండు మున్సిపాలిటీలు తోడయ్యే అవకాశం కనిపిస్తోంది. సత్యవేడు, వరదయ్యపాలెం మండల కేంద్రాలను నగర పంచాయతీలుగా మార్చాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. శ్రీసిటీతో పాటు ఏపీఐఐసీకి చెందిన పలు పారిశ్రామిక పార్కులు వుండి, అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలున్న ప్రాంతం కావడంతో సత్యవేడు, వరదయ్యపాలెం మండల కేంద్రాలు వేగంగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్నాయని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని వీటిని పంచాయతీల నుంచీ నగర పంచాయతీలుగా స్థాయి పెంచాలని ప్రతిపాదించారు. సత్యవేడు పంచాయతీ ప్రస్తుత జనాభా 17 వేలు కాగా సమీపంలోని కాలమనాయుడు పేట, కొత్తమారికుప్పం, ఎన్ఆర్ అగ్రహారం, వీఆర్ కండ్రిగ తదితర పంచాయతీలను కలుపుకుంటే జనాభా సుమారు 30 వేలకు చేరుతుంది. వాటిని కలిపి నగర పంచాయతీగా మార్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే వరదయ్యపాలెం మండల కేంద్రం ప్రస్తుత జనాభా 7 వేలకు పైగా వుంది. దాన్ని కూడా నగర పంచాయతీగా మార్చే అవకాశం కనిపిస్తోంది. సమీప భవిష్యత్తులో గూడూరు మున్సిపాలిటీని కోల్పోయినా నగరి మున్సిపాలిటీ జిల్లాకు చేరనుంది.

ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌కు తుది పరీక్షలు



సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో భారీ ఉపగ్రహ ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. ఇప్పటి వరకు ఎన్నో శక్తిమంతమైన ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిన ఇస్రో తాజాగా 4,410 కిలోల బరువు కలిగిన మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. నవంబరు 2న సాయంత్రం 5:26 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్ నింగిలోకి ఎగరనుంది.ప్రయోగ వేదికపై ఉన్న రాకెట్‌కు బుధవారం శాస్త్రవేత్తలు తుది పరీక్షలు నిర్వహించి ప్రయోగానికి సిద్ధం చేస్తున్నారు.ప్రయోగానికి సంబంధించిన ఎంఆర్ఆర్ సమావేశం ఈ నెల 31న షార్‌లో జరగనుంది. అదేరోజు మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశం షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో కౌంట్‌డౌన్ సమయం అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఇస్రో వర్గాల సమాచారం మేరకు కౌంట్‌డౌన్‌ను 24 గంటల ముందు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇస్రో అత్యంత బరువైన ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఇదే ప్రథమం. భారత్ సహా విశాలమైన సముద్ర ప్రాంతంలో కమ్యూనికేషన్ సేవలు అందించడం కోసం ఈ ఉపగ్రహాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి ప్రయోగిస్తున్నారు. రాకెట్ ప్రయోగం 16 నిమిషాల్లో పూర్తయ్యేలా డిజైన్ చేశారు.

పోలిలో సోలార్ ప్లాంట్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి డివిజన్‌లోని పోలి గ్రామంలో 58ఎకరాల్లో సోలార్ ప్లాంట్‌కు భూమి కేటాయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. జిల్లా సౌర విద్యుత్ పనులు వేగవంతంగా సాగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 25మెగా వాట్ల సోలార్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని అందులో భాగంగా మోహన్ స్పిన్‌టెక్స్ కంపెనీకి పనులు అప్పగించామన్నారు. 25మెగావాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకోసం పోలి గ్రామంలో భూమి మంజూరు చేసినట్లు తెలిపారు.



గూడూరు సమీపం పంబలేరు చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

తొలగిన తుఫాన్ ముప్పు

- ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుఫాను ముప్పు పూర్తిగా తొలగిపోయింది. జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గత ఆదివారం నుంచీ అత్యంత అప్రమత్తంగా ఉంటూ రాత్రింబవళ్లు విధులు నిర్వర్తించిన యంత్రాంగానికి టెన్షన్ తప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా బలపడిన సమయంలో వాతావరణ పరిశోధనా కేంద్రం జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ నుంచీ అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. జిల్లాలో ఐదు మండలాలు సముద్ర తీరాన ఉండటం, మరిన్ని మండలాలు తీరానికి చేరువగా ఉండటంతో అధికార యంత్రాంగం ఆందోళనకు గురైంది. జిల్లాలో వెలిగొండ, శేషాచల కొండలున్న కారణంగా భారీ వర్షాలకు కైవల్య, స్వర్ణముఖి నదులు, పలు వాగులూ ఉధృతంగా ప్రవహిస్తాయి. అలాగే దక్షిణాన కాళంగి, అరుణా నదులు, ఇతర వాగులు సైతం జోరుగా పారుతాయి. దీంతో జిల్లాలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు సునాయాసంగా నిండిపోతాయి. ఇక, వర్షాల తీవ్రత పెరిగితే లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, చెరువులకు గండ్లు పడడం, పంటలు నీట మునగడం, రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు కొట్టుకుపోవడం వంటి అనర్థాలు జరుగుతున్నాయి. ఈ అనుభవాల నేపథ్యంలో మొంథా తుఫానుతో జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించడం యంత్రాంగాన్ని కలవరపరిచింది. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా పంపడంతో పాటు తక్షణ సహాయక చర్యలకు నిధులు కూడా కేటాయించింది. ఎస్డీఆర్ఎఫ్ బృందాలను కూడా పంపింది. మరోవైపు మండల స్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయించిన కలెక్టర్ మూడు రోజుల పాటు సచివాలయాల స్థాయిలో రాత్రింబవళ్ళు ఉద్యోగులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్, ఎస్పీ, ప్రత్యేకాధికారులతో పాటు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని పరిశీలిస్తూ వచ్చారు. అయితే మంగళవారం సాయంత్రానికే తుఫాను ముప్పు తగ్గిందని ప్రభుత్వం జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. తుఫాను ముప్పు తగ్గినా ప్రత్యేకించి తీరానికి చేరువగా వున్న 11 మండలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. చివరికి బుధవారం ఆ ముప్పును కూడా జిల్లా తప్పించుకుంది. మూడు రోజుల పాటు ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన జిల్లా అధికార యంత్రాంగం, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. వెయ్యి హెక్టార్ల వరకూ పంటలు నీట మునగడంతో పాటు 16 ఇళ్ళు కూలిపోవడం, కొన్ని చెరువులకు గండ్లు పడడం, రోడ్లు దెబ్బతినడం మినహా ఎక్కడా ప్రాణ నష్టం జరగకపోవడం అధికార యంత్రాంగానికి ఊరట కలిగించింది. తొలుత భయపడ్డ స్థాయిలో నష్టాలు సంభవించకపోవడంతో అధికారులతో పాటు ప్రజలకు సైతం ఉపశమనాన్నిచ్చింది. బుధవారం ఉదయం నుంచి ఎండ రావడంతో.. జనజీవనం సాధారణ స్థితికి వచ్చింది. జిల్లాలో కొన్ని వాగులు బుధవారమూ ఉధ్రుతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు పరిశీలించారు.


'విధులకు డుమ్మా'పై ఆందోళన

తడ, ఆంధ్రజ్యోతి: తుఫాన్ సమయంలో కొందరు అధికారులు, ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టడంపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం వెలువడటంతో అధికారవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎవరిపై చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే తడ మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసిచ్చారు.

'మొంథా' నష్టాన్ని లెక్కించండి

- పునరావాస కేంద్రాలకు నిత్యావసరాలు అందించాలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని లెక్కించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. తుఫాన్ నష్టపరిహార గణన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. బురద, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. చెరువులు, కాజ్‌వేలు వద్ద వరద ప్రవాహం తగ్గే వరకు పర్యవేక్షిస్తుండాలన్నారు. గుంతలు ఏర్పడిన చోట రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నిత్యావసర సరుకులు, ప్రతి కుటుంబానికీ రూ.3వేలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో నాలుగు రోజులు బీచ్‌లు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి మాజీ డీసీపై సస్పెన్షన్ ఎత్తివేత

- దూరంగా, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ప్రభుత్వ ఆదేశం
- ఓటరు కార్డుల వ్యవహారంలో కొనసాగనున్న విచారణ

తిరుపతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ కమిషనర్ పి.చంద్రమౌళీశ్వరరెడ్డిపై సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే శాఖాపరమైన విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. విచారణను ప్రభావితం చేసే వీలు లేకుండా తిరుపతికి దూరంగా బదిలీ చేయాలని, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన పి.చంద్రమౌళీశ్వర్‌రెడ్డి 2021 నాటి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. అప్పట్లో ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు తనకు తానే ఈఆర్వోగా వ్యవహరించారనేది ప్రధాన ఫిర్యాదు. ఆ హోదాలో ఎలాంటి క్లైమ్ ఫారాలూ లేకుండానే ఓటరు ఐడీ కార్డులను వేల సంఖ్యలో డౌన్‌లోడ్ చేశారనేది మరో ఆరోపణ. వీటిని తీవ్రంగా పరిగణించిన ఎన్నికల కమిషన్ విచారణకు ఆదేశించింది. దీంతో పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాటి దర్యాప్తునకు సిట్ కూడా ఏర్పాటైంది. ప్రాథమిక విచారణలో చంద్రమౌళీశ్వరరెడ్డి ఈసీ నోటిఫికేషన్ జారీ చేయకుండానే తనకు తానుగా తిరుపతి సెగ్మెంట్‌కు ఈఆర్వోగా ఎన్నికల్లో విధులు నిర్వర్తించినట్టు తేలింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని ఈసీ ఆదేశించిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరి 9న చంద్రమౌళీశ్వరరెడ్డిని సస్పెండ్ చేసింది. సస్పెన్షన్ ఎత్తివేసే విషయమై గతేడాది సెప్టెంబరు 27న, ఈ ఏడాది ఏప్రిల్ 25న రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల కమిటీ సమీక్షించినప్పటికీ ఆయనపై వచ్చిన ఆరోపణల తీవ్రత దృష్ట్యా కొనసాగించాలని నిర్ణయించింది. ఏడాది దాటినా తనపై సస్పెన్షన్ ఎత్తివేయలేదని, తనను తిరిగి సర్వీసులోకి తీసుకోలేదని చంద్రమౌళీశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రిట్ పిటిషన్ (నంబరు 16450-2025)పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఆ క్రమంలో ఆగస్టు 21న ఉన్నతాధికారుల కమిటీ మరోసారి సమావేశమై చంద్రమౌళీశ్వరరెడ్డి సస్పెన్షన్‌పై సమీక్షించింది. విచారణ కొనసాగిస్తూనే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నిర్ణయించింది. ఆయనను తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని కూడా నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు నివేదించగా ఈసీ కూడా అంగీకరించింది. దీంతో చంద్రమౌళీశ్వర్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణను ప్రభావితం చేయకుండా అతడిని తిరుపతి కార్పొరేషన్‌కు సుదూరంగా బదిలీ చేయాలని, నాన్ ఫోకల్ పోస్టులో నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రగిరి

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ


అర్జీదారుతో మాట్లాడుతున్న నాని

తిరుచానూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తన పల్లి రఘునాథ్‌రిసార్ట్‌లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత అధికారులకు వాటిని తెలియజేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పాకాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల జీవితంలో కౌమార దశ కీలకమైనదని ప్రధానోపాధ్యాయురాలు సుమలత అన్నారు. మొగరాల జడ్పీ హైస్కూల్‌లో బుధవారం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 11-18 సంవత్సరాల లోపు బాలికల శరీర మార్పుల్లో ఎదుగుదల వేగంగా వుంటుందన్నారు. ఈ దశలో ఆరోగ్యపరమైన సవాళ్లు ఎదురవుతాయన్నారు. శారీరక ఆరోగ్యం, విద్య, ఋతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, బాల్యవివాహాల అనర్థాలు గురించి వివరించారు. ప్రభుత్వం సరఫరా చేసిన ముద్దమందారం పుస్తకాన్ని బాలికలకు అందజేశారు. కౌన్సిలర్ ఉపాధ్యాయులు వి.వెంకటసిద్దులు, సుల్తాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేతతో తప్పిన ప్రమాదం


గండి పూడ్చివేత పనుల పర్యవేక్షణ

ఎర్రావారిపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేవినేని చెరువుకు పడిన గండిని సకాలంలో పూడ్చడంతో ప్రమాదం తప్పింది. పెద్ద చెరువు దేవినేని చెరువు నిండితే పది నెలల పాటు సాగు అవసరాలు తీరతాయి. పశువులు తాగడానికి ఉపకరిస్తుంది.. గతంలో ఒక్కసారి చెరువుకు గండి పడింది. బుధవారం అదే చోటుకు సమీపాన గండి పడింది. నీరు దిగువకు పోతుండంతో కోతకు గురై కట్టకు పెద్ద సొరంగం పడింది. విషయం తెలియగానే ఎంపీడీవో మదన్ మోహన్ రాజు, ఇరిగేషన్ ఎఈ చంద్రమోహన్ రెడ్డి ,తహసీల్దార్ పరమేశ్వర స్వామిలు స్పందించారు. వారి సహాయంతో చెరువు ఆయకట్టు రైతులుట్రాక్టర్‌లు,జేసీబీల సహాయంతో గండికి మన్ను తోలి పూడ్చారు. దీంతో చెరువుకు ప్రమాదం తప్పింది.

ఉపాధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

రామచంద్రాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుపేటలో జరుగుతున్న ఉపాధి పనులను ఉపాధి పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ బుధవారం పరిశీలించారు. నీటికుంటల్లో నీరునిల్వ ఉండేలా పనులను చేపట్టాలన్నారు. పనుల వద్ద మస్టర్లతోపాటు కూలీలకు తగిన వసతులు కల్పించాలని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వర ఆలయంలో ప్లాస్టిక్ నిషేధం


సమావేశమైన పాలకమండలి సభ్యులు

ఎర్రావారిపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి); తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో సోలార్ వెలుగులకు చర్యలు తీసుకోవాలని పాలకమండలి తీర్మానించింది. బుధవారం సమావేశమై ఇందుకోసం సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పాలకమండలి చైర్మన్ సోమనాథరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించారు. అలయంలో నూరు శాతం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, భక్తులకు ప్రసాదం, లడ్డు వితరణ చేయలాని, పోటు గది నిర్మించాలని తీర్మానించారు. ఇప్పటికే ఆలయంలో టీటీడీ నిధులు రూ.18 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు.. సమావేశంలో ఈవో రవీంద్ర రాజు, సభ్యులు శివేలు రమేష్, చెంగమ్మ, ఇందిరా, శోభా, చలపతి, ఈశ్వరయ్యరాజన్న, శశికళ, ఎక్స్‌అఫీషియో సభ్యుడు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

1 నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నవంబరు 1 నుంచి 10వ తేది వరకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజ విభూది అభిషేకం, భూమిపూజ చేయనున్నారు. 2న ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రి మూషిక వాహనంపై వినాయకస్వామిని ఊరేగిస్తారు. 3న మయూర వాహనంపై సుబ్రమణ్యంస్వామి, సింహ వాహనంపై ఆనందవళ్లీ అమ్మవార్లను ఊరేగిస్తారు. 4న శేష , భూత వాహనలపై స్వామి అమ్మవార్లు ఊరేగిస్తారు. 5న నంది వాహనంపై, 6న కామధేను వాహనం, 7న చంద్రప్రభ, 8న కల్పతరువు, 9న నంది వాహనంపై స్వామి అమ్మవార్లు దర్శనమిస్తారు. 10న ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ధర్మకర్త రఘునాథరెడ్డి తెలిపారు.

హైవేలో ప్రమాదాల నివారణకు చర్యలు


పమాద ప్రదేశాలను గుర్తిస్తున్న పోలీసులు

చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ప్రసాద్ హైవే ఆథారిటీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐలు మురళీమోహన్, రవీంద్రనాయక్, అనిత, సిబ్బందితో కలిసి చంద్రగిరి నుంచి గాదంకి టోల్ ప్లాజా వరకు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించారు. హైవే ఆథారిటీ అధికారులు కూడా పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 20 రోజుల్లో చర్యలు తీసుకుంటామని అధికారులు డీఎస్పీకి వివరించారు. తెలిపారు.

ముంపు ప్రాంత రైతులను ఆదుకోండి

రామచంద్రాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో నీట మునిగిన పంటపొలాల రైతులను ఆదుకోవాలని తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కోరారు. రాయలచెరువును ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ డిల్లీరాణి ఇతర వైసీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. కాలేపల్లి, చిట్టత్తూరు గ్రామాల్లో రైతులను పరామర్శించారు. **తిరుపతి రూరల్:** చిగురువాడ స్వర్ణముఖినది వద్ద తాత్కాలిక వంతెనను మోహిత్‌రెడ్డి పరిశీలించారు. శాశ్వతవంతెన నిర్మాణానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కుంట్రపాకంలో పర్యటించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

పాకాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ తెలిపారు. అపోలో ఫార్మసీ, జెప్టో, టీవీఎస్ ఇండియన్, పేటీఎం, స్విగ్గి, జుమాటో, ర్యాపిడో, బ్లింకిట్ సంస్థలు మేళాలో పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ పాసైన ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఫోటోలతో ఉదయంహాజరు కావాలన్నారు. వివరాలకు 6304113020 నంబరుకు సంప్రదించాలన్నారు.

బస్సును ఢీకొన్న కారు

● కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


దెబ్బతిన్న కారు

చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రవణప్పగారిపల్లె వద్ద జాతీయ రహదారిలో బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు తిరుపతికి చెందిన అరుణ్ కుమార్ బుధవారం తెల్లవారుజామున కారులో తిరుపతి నుంచి చిత్తూరు బయలుదేరారు. ఈక్రమంలో బెంగళూరు నుంచి తిరుపతి వస్తున్న ఆర్టీసీ బస్‌ను రవణప్పగారిపల్లె వద్ద రాంగ్‌రూట్లో వచ్చిన కారు ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారు డ్రైవర్ అరుణ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్యవర్క్ ఉచిత శిక్షణ ప్రారంభం


శిక్షణలో పాల్గొన్న మహిళలు,నిర్వాహకులు

తిరుపతిరూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): సి.మల్లవరం పంచాయతీ ముస్లీంపేటలో రాస్-జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఆర్యవర్క్(మగ్గం)పై ఉచిత శిక్షణ ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా రాస్ డైరెక్టర్ వి.నాగరాజు, జన్ శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్‌లు హాజరయ్యారు. శిక్షణ పొంది చేతివృత్తుల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని వారు ఆకాంక్షించారు. ఉచితంగా ముడిసరుకు అందించారు. డాక్టర్ సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, నాగరాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

షార్ రోడ్డులో ఒరిగిపోయిన లారీ



సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డులో షార్ బస్సుల గ్యారేజ్ వద్ద సిమెంట్ లోడుతో వెళ్తున్న ఓ లారీ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులకు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీని రోడ్డు పక్కన ఆపేందుకు డ్రైవర్ దారి అంచుకు వెళ్లగానే వర్షాలకు సైడ్ బర్మర్ తడిగా ఉండడంతో టైర్లు కుంగిపోయి పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వారణాసిలో శ్రీకాళహస్తీశ్వరుడి కల్యాణోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వారణాసి క్షేత్రం కాశీ విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం కల్యాణ ఘట్టం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పునీతులయ్యారు. ఆలయ అధికారి విజయసారథి, వేదపండి తులు త్రినాధస్వామి, మారుతీరామ్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు బుధవారం తెలిపారు. నవంబరు 3, 10, 17 తేదీల్లో ఉ దయం 5గంటలకు శ్రీకాళహస్తి బస్టాండు నుం చి గుడిమల్లం, అప్పలాయగుంట, వకుళమాత ఆలయం, ముక్కోటి, తలకోనకు వెళ్లి సా యంత్రం 5గంటలకు డిపోకు చేరుకుం టుం దన్నారు. రానుపోను రూ.450 మాత్రమే అని తెలిపారు. ఆన్‌లైన్‌లో కానీ, బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద టిక్కెట్లను బుక్ చేసు కోవచ్చన్నారు. వివరాలకు నెం.7382880178, 7282881715లలో సంప్రదించవచ్చన్నారు. ప్రతి నెలా పౌర్ణమికి శ్రీకాళహస్తి నుంచి తిరువ ణ్ణామలైకు బస్సులు నడుపుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


మృతి చెందిన పుల్లయ్య

సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శేషసాయి కల్యాణ మండం ఎదురుగా జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమా దంలో గంపలకండ్రిగకు చెందిన పల్లికొండ పుల్లయ్య(59) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... గంపలకండ్రిగకు చెందిన పుల్లయ్య సూళ్లూరుపేటకు వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ షాపు వద్ద మోటారు సైకిల్ ఆపారు. ఎదురుగా ఉన్న హోటల్‌లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఓ మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో చెయ్యి, కాలు తిరిగి, తలకు బలమైన గాయాలవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడ్ని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినుకు పడితే తప్పని తిప్పలు


మల్లంగుంట రహదారి దుస్థితి ఇది


గుంతలమయమైన కొత్తూరు రోడ్డు

తిరుపతి రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల అంతర్గత రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. రెండు మూడు రోజులుగా ఈ గుంతల్లో వర్షపు నీరు చేరి మరింత ఇబ్బందికరంగా తయారవుతున్నాయి.. కొన్ని గ్రామాల్లోని బీటీ రోడ్ల మధ్య మట్టిపెళ్లలు ఎత్తుగా ఉండడంతో బురదమయమై రాకపోకలకు పరీక్ష పెడుతున్నాయి. గుంతల వద్ద అదుపు చేసే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి నుంచి రామానుజపల్లెకి వెళ్లే మార్గం, గొల్లపల్లె-పెడిపల్లె మధ్య రాకపోకలు సాగించే రహదారిపై పలుచోట్ల భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఆర్సీపరం- మల్లంగుంట మార్గంలో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. గ్రామం మీదుగా కొత్తూరు, పూతలపట్టు-నాయుడుపేటకు వెళ్లే రోడ్డు, వేదాంతపురం సచివాలయానికి వెళ్లే రోడ్డు, దుర్గ సముద్రంలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతోంది.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన


రైతుతో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్ అధికారి

తిరుపతి రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): వేమూరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ట్రైనీ ఐఏఎస్ అధికారి సందీప్ రఘువంశీ బుధవారం సందర్శించారు. రైతు అయ్యప్పనాయుడి పొలంలో ఏటీఎం మోడల్‌లో పండిస్తున్న ఆకుకూరలు, కూరకాయలు, తీగజాతి పండ్లమొక్కలను పరిశీలించారు. బీఆర్సీ కేంద్రాల్లో కషాయాల వినియోగం, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలపై ఆరాతీశారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముగం ,మండల వ్యవసాయాధికారి సుబ్బారావు, మధు, మహమ్మద్ హసన్, పాల్గొన్నారు.

గజలక్ష్మీ నమోస్తుతే



తిరుచానూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు బుధవారం గజవాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని ఉదయం అమ్మవార్ల మూలవర్లకు అభిషేకం చేశారు. రాత్రి అమ్మవారు గజవాహన సేవ తిరుమాడ వీధుల్లో ఊరేగారు. డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంటు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ల ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వరదరాజస్వామి విగ్రహ జలధివాసం


విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీ శ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న వరద రాజస్వామి ఆలయంలో బుధవారం అత్తి వరదరాజ స్వామి విగ్రహ జలధి వాసం శాస్త్రోక్తంగా జరిగింది. అగ్ని ప్రతిష్ఠాపనం, కుంభారాధనం జరిగాయి. వేదపండితులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సాయి ప్రసాద్ పట్టువస్త్రాలను సమర్పిం చారు. ఎమ్మెల్యే సుధీర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా గురు వారం ఉదయం 7గంటలకు అగ్నిప్రణయనం, కుంభారాణం, సాయంత్రం మహాశాంతి అభిషేకం, శుక్రవారం అగ్నిప్రణయనం, కుంభారాధనం, సర్వగాయత్రి హోమం జరగనున్నాయి.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి

చంద్రగిరి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన మాజీ జడ్పీటీసీ, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి వీరంగారి రమేష్‌రెడ్డి సోదరుడు గోపినాథ్‌రెడ్డికి ఎమ్మెల్యే పులివర్తి నాని నివాళులర్పించారు. ఆదివారం వెళ్లి మృత దేహానికి పూలమాల వేసి రమేష్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు ముడిపల్లె సురేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో చెన్నై కంపెనీ ఎంవోయూ


అవగాహన ఒప్పంద పత్రాన్ని ప్రదర్శిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పుత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో చెన్నైకి చెందిన డెల్ఫీ టీవీఎస్ కంపెనీ బుధవారం ఎంవోయూ కుదిరింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ... నైపుణ్యం, శిక్షణ, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఒప్పందంపై కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగరాజన్ సంతకం చేశారని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణాధికారి వేలాయుధ ఆచ్చారి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

1 నుంచి కల్యాణ వెంకన్న కార్తీక తెప్పోత్సవాలు

నారాయణవనం, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువై ఉన్న పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయ వార్షిక తెప్పోత్స వాలు నవంబర్ 1వ తేది నుంచి 5 రోజులు పాటు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తామర గుంట పుష్కరిణి చుట్టూ శుభ్రం చేసి, విద్యుత్ దీపాలు, కటౌట్లను ఏర్పాటు చేశారు. నవంబర్ 1 తేది శనివారం రాత్రి సీతాలక్ష్మణ సమేత రామచంద్ర మూర్తి, 2వ తేది అండాల్ అమ్మవారు, 3, 4, 5 తేదిల్లో శ్రీదేవి, భూదేవి సమేతే కల్యాణ వెంకన్న తెప్పలపై విహరిస్తారని ఆలయ పర్యవేక్షకుడు నాగరాజు తెలిపారు.

డెయిరీ వ్యర్థాలతో చెరువులో చేపల మృతి

గంగవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : డెయిరీ వ్యర్థాలతో చెరువుల్లోని నీరు కలుషితమై చేపలు, పాములు మృతి చెందిన సంఘటన గంగవరం మండలం పసపత్తూరు పంచాయతీలో జరిగింది. కొంత కాలంగా పసపత్తూరు సమీపంలోని ఫామ్‌గేట్ డెయిరీ వ్యర్థాలను పరిసర ప్రాంతాల్లోని వనపగుంట, తూము గుంట, కమ్మవాళ్ల కుంట చెరువుల్లో వదిలేయడంతో మంగళవారం రాత్రి చేపలు, పాములు, కప్పలు అధిక సంఖ్యలో మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి బుధవారం చెరువుల వద్దకు చేరుకుని పరిశీలించారు. మత్స్య, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో పాటు పొల్యూషన్ కంట్రోల్ అధికారులను పిలిపించి చెరువు నీరు కలుషితం కావడానికి గల కారణాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. జంతువులకు నీరు తాగించకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. డెయిరీ నుంచి వస్తున్న వ్యర్థాలను గుర్తించి చెరువుల్లోకి రాకుండా అరికట్టాలని.. చెరువునీటిని శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే చేపలు, పాములు మృతి చెందడానికి కారణమైన వారి నుంచి నష్టపరిహారం వసూలు చేయించాలని.. ఆదేశించారు.ఏఎంసీ చైర్మన్ రాజన్న, తహసీల్దార్ రేఖ, ఇరిగేషన్ డీఈ చొక్లానాయక్, ఏఈ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పయని, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సోమశేఖర గౌడ్, ప్రతాప రెడ్డి, ప్రసాద నాయుడు, భాస్కర రెడ్డి, గిరిధర్ గోపాల్, సోము, శేఖర్, రెడ్డెప్ప, శీన, హేమగిరి తదితరులు పాల్గొన్నారు.



గుర్రపుడెక్కతో నిండిపోయిన దూడలకాలువ - చల్లకాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క

వరద పారే దారేదీ?

● కాలువల నిండా గుర్రపుడెక్క
● పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
● నివాస గృహాల్లోకి వర్షపునీరు

గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ల సమయంలో వరదనీరు గూడూరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా సజావుగా ముందుకు సాగేలా పలు కాలువలు ఉన్నాయి. ఇందులో పంబలేరువాగు, చల్లకాలువ, దూడల కాలువ ప్రధానమైనవి. వీటిల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. మొంథా తుఫాను ప్రభావంతో 24 గంటల పాటు ఎడతెరపిలేకుండా మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం లేకపోవడంతో కాలువల్లో నీటి ప్రవాహం సైతం తక్కువగా ఉంది. గూడూరు పరిసర ప్రాంతాల్లో పడిన వర్షపునీటితో వెంకటగిరి కైవల్యానది పొంగితే వచ్చే వరద, కండలేరు జలాశయం నుంచి విడుదల చేస్తే వచ్చే నీరంతా పట్టణంలోని పంబలేరు, చల్లకాలువ, దూడల కాలువల ద్వారా ప్రవహించి పురిటిపాళెం సమీపంలోని పంబలేరు వాగులోకి చేరుకుని చిల్లకూరు మండలం తిప్ప గుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరులో కలసి, అక్కడ నుంచి గుమ్మళ్లదిబ్బ సముద్రంలోకి చేరుతుంది. అయితే చల్లకాలువ, దూడలకాలువలలో గుర్రపుడెక్క పేరుకుపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. చల్లకాలువను ఆనుకుని జనార్దనరెడ్డికాలనీ, సాధుపేట, దూర్జటినగర్, దూడల కాలువను ఆనుకుని విఘ్నేశ్వరపురం, ఆర్టీసీ బస్టాండు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించకపోతే వరద ఉధృతి పెరిగితే కట్టలు దెబ్బతిని నివాసగృహాల్లోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి చల్లకాలువ, దూడలకాలువలో గుర్రపుడెక్క తొలగించి, నీటి ప్రవాహం సజావులా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తుంబూరు కాజ్‌వేకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్


బాధితులకు నగదు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నారాయణవనం, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంబూరు కాజ్‌వే సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నారాయణవనంలోని తుంబూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వెదర్లకండ్రిగలోని ఎస్టీ కాలనీకి చెందిన 16 కుటుంబాలకు సమీప పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని, డ్రైనేజీ కాలవలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోజారాణి, డిప్యూటీ తహసీల్దార్ భానుచందు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోండి సారూ..!

ఎర్రమిట్టలో రోడ్డుపైనే చెత్త




నగరంలోని 45వ డివిజన్ సాయిబాబా గుడి వెనుక వైపు పెద్దకాలువ ఆనుకుని చెత్త ను రోడ్డుపై వదిలేశారు. కాలువను శుభ్రం చేసే క్రమంలో రోడ్డుపై వేసిన చెత్తను నాలుగైదు రోజులుగా తొలగించలేదు. వర్షానికి కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి తొలగించాల్సి ఉంది.

- తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి)

గుంతలను పూడ్చండి



నగర పరిధిలోని ఒకటో డివిజన్ కూరపాటి రామచంద్రనగర్ రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

- తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి)

పేటశ్రీకి సాహితీ పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని పేట శ్రీనివాసులు రెడ్డి అందుకున్నారు. ఆయన రాసిన తిరుపతి కథలు పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం ఈ సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. హైదరాబాద్ ఎన్టీఆర్ కళా మందిర్‌లో బుధవారం ఈ పురస్కారాన్ని విశ్వవిద్యాలయం వీసీ వెల్దండ నిత్యానందరావు, ఆంధ్రప్రదేశ్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వీసీ డి. మునిరత్నం నాయుడు, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ విభాగాధిపతి ఎస్ .రమేష్ సుంకసారి చేతుల మీదుగా అందుకున్నారు. సాహితీ పురస్కారం కింద రూ.20,116 నగదు బహుమతితో సత్కరించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



ఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీటీడీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్, వి.రాజ్‌కుమార్, పి.శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు బుధవారం టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో భజన మందిరాలు నిర్మించాలని కోరారు. టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని, గిరిజన గోవిందం కార్యక్రమం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చేతివృత్తులతో ఆర్థికాభివృద్ధి



వృత్తి శిక్షణ కోర్సులపై అవగాహన కల్పిస్తున్న నాగరాజు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మహిళలు చేతివృత్తుల ద్వారా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. రాస్-జనశిక్షణ సంస్థాన్ అధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం ముస్లింపేటలో బుధవారం మహిళలకు ఆర్య వర్క్‌పై ఉచిత శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మహిళలు కాలాన్ని వృథా చేయకుండా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్య వర్క్ నేర్చుకుని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటే, ఆర్థికంగా కుటుంబాలను ఆదుకోవచ్చునని చెప్పారు. శిక్షణకు హాజరైన మహిళలకు ముడిసరుకును ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.మోహన్, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, కుమారి, నాగరాజు, లావణ్య మహిళలు పాల్గొన్నారు.

ఆకతాయిల దాడిలో ముగ్గురికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆకతాయిలు దాడి చేయడంతో ఇద్దరు వృద్ధులు, మరో యువకుడు గాయపడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెస్ట్ సీఐ మురళీమోహన్ వివరాల మేరకు... కమతం సుధారాణి సంజయ్‌గాంధీ కాలనీలో కాపురముంటున్నారు. ఆమె తండ్రి కృష్ణమూర్తి నడుచుకుంటూ అలిపిరి రోడ్డు వైపు వెళుతున్నారు. వైకుంఠపురానికి చెందిన సాహిత్ ద్విచక్ర వాహనంపై వేగంగా అలిపిరి వైపు వెళుతున్నాడు. అదే సమయంలో రోడ్డు దాటుతున్న కృష్ణమూర్తిని ఢీకొట్టాడు. కృష్ణమూర్తి కిందపడి గాయాలపాలయ్యాడు. ఇదేమిటని ప్రశ్నించినందుకు మళ్లీ దాడి చేశాడు. పక్కనే ఉన్న కృష్ణమూర్తి బంధువులు హరిబాబు, రవి 'బండితో కొట్టి గాయపరిచింది కాక.. అడిగినందుకు కొడతావా' అని నిలదీశారు. దీంతో మరింత రెచ్చిపోయిన సాహిత్ వారిపైనా దాడి చేశాడు. సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు సాహిత్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

గోశాలపై మరి, ఇప్పుడేమంటారు?

భూమన కరుణాకరరెడ్డి



భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'గోశాల నిర్వహణ సరిగా లేదని బోర్డు సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు చెప్పారు. మరి అదే విషయాన్ని నేను చెబితే నామీద కేసులు పెట్టారు. అవే సెక్షన్లు టీటీడీ చైర్మన్‌కి కూడా వర్తిస్తాయి కదా' అని టీటీడీ మాజీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం తన నివాసంలో రికార్డు చేసిన ఒక వీడియోను ఆయన ప్రకటనగా విడుదల చేశారు. ఏప్రిల్‌లో తాను గోశాల నిర్వహణ సరిగా లేక గోవుల మరణాలు జరిగాయని అన్నందుకు బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడి మత విద్వేషాలను రెచ్చగొడుతున్నానంటూ ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గోశాల నిర్వహణకు ప్రత్యేక కమిటీని వేసి, గోవులను స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చే ఆలోచన ఉందని, దీనిపై వచ్చేబోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఏకంగా టీటీడీ చైర్మనే చెప్పారని అన్నారు.

నారావారిపల్లెకు 'స్త్రీశక్తి' బస్సేది?

ఉచిత ప్రయాణానికి నోచని మహిళలు

తిరుపతి (ఆర్టీసీ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్త్రీశక్తి' పథకం సీఎం స్వగ్రామం నారావారిపల్లె మహిళలకు అందడం లేదు. ఆర్టీసీ ఏర్పడక ముందు నుంచే తిరుపతి నుంచి చంద్రగిరి మండలం యల్లంపలి, మూలపల్లెలకు బస్సులు నడిచేవి. ఆ తర్వాత ఆర్టీసీ బస్సులు కొనసాగాయి. తిరుపతి, చంద్రగిరి, శ్రీనివాస మంగాపురం, రంగంపేట, భీమవరం, శేషాపురం మీదుగా చివర్లో యల్లంపల్లి, మూలపల్లెలకు రాకపోకలు సాగించేవి. క్రమేణా గ్రామాల్లో సొంత వాహనాలు, షేర్ ఆటోలు పెరగడంతో ఆర్టీసీకి ఆదరణ తగ్గింది. ఈ సాకుతో 2019లో ఆర్టీసీ బస్సులను ఆపేశారు. అటు తర్వాత దీనిపై ఆయా గ్రామాల ప్రజల నుంచి గాని నేతల నుంచి గాని డిమాండు రాలేదు. అయితే స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి మహిళలు ఆర్టీసీ బస్సులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆర్టీసీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఒకటిన జిల్లాస్థాయి ఈత పోటీలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో శనివారం మూడు విభాగాలలో జిల్లాస్థాయి ఈత పోటీలు నిర్వహించనున్నట్లు చిత్తూరు డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్స్ విభాగంలో మెన్ అండ్ ఉమెన్(25 నుంచి 90ఏళ్ల వరకు), సబ్ జూనియర్ విభాగంలో (7నుంచి 10ఏళ్ల వరకు), జూనియర్ విభాగంలో (11నుంచి 17ఏళ్ల వరకు) క్రీడాకారులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు జనన ధృవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8121777077ను సంప్రదించాలని కోరారు.

ఇక మరిన్ని సహజ ప్రసవాలు

ప్రసూతి సహాయకుల నియామకానికి చర్యలు ● ఏడాదిన్నర శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక



తిరుపతిలోని మెటర్నిటి ఆసుపత్రిలో ప్రసూతి వార్డు

తిరుపతి(వైద్యం), అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని ప్రభుత్వం బలంగా సంకల్పిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వాస్పత్రుల్లో ఈ తరహా కాన్పులెక్కువ జరుగుతున్నాయి. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పూర్తిస్థాయిలో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది. సహజ ప్రసవాలు తల్లీబిడ్డలకు సురక్షితం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సగటున 50 శాతం సహజ కాన్పులు జరుగుతున్నా మిగిలిన కేసుల్లో గర్భిణుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సిజేరియన్ చేయాల్సి వస్తోంది. అయితే ప్రయివేట్ ఆస్పత్రుల్లో మాత్రం వ్యాపారకాంక్షతో చాలామటుకు సిజేరియన్ కాన్పులనే చేస్తున్నారు.

జిల్లాలో కాన్పుల వివరాలు...

సంవత్సరం	సహ.	సిజేరియన్	మొత్తం కాన్పులు
2022-23	19,450	21,591	41,041
2023-24	20,334	18,511	38,845
2024-25 (జూన్ వరకు)	18,119	20,401	38,520

ఏడాదిన్నర ప్రత్యేక శిక్షణ

జిల్లాలో 34 మండలాల పరిధిలో పీహెచ్‌సీలు 58, సీహెచ్‌సీలు 12, రెండు ప్రాంతీయ ఆస్పత్రులు, మరో రెండు బోధనాస్పత్రులు ఉన్నాయి. వీటితోపాటు తిరుపతిలో ప్రధానంగా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఉంది. వీటిలో ఏటా దాదాపు 40 వేల కాన్పులు జరుగుతున్నాయి. ఇందులో సహజ ప్రసవాలు పెరగకపోవడాన్ని ప్రభుత్వం గుర్తించింది. దాదాపు 30 పీహెచ్‌సీల్లో మహిళా వైద్యులు లేరు. అత్యవసరంతో పాటు సాధారణ కేసులను తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి లేదా ఏరియా ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి పీహెచ్‌సీలోనూ ప్రసూతి సహాయకురాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం స్టాఫ్‌నర్సులకు 18 నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు క్షేత్రస్థాయిలో గర్భిణులకు మొదటి నుంచి కౌన్సెలింగ్ ఇస్తారు. సాధారణ కాన్పు జరగాలంటే ఏ విధమైన పద్ధతులు పాటించాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్య ప్రయోజనాలు, సిజేరియన్ నష్టాల గురించి వివరిస్తారు. సహజ కాన్పు వైపు మొగ్గు చూపేలా చైతన్యం తీసుకువస్తారు.

99శాతం జరిగే అవకాశాలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్కువ భాగం సాధారణ కాన్పులు మాత్రమే జరుగుతున్నాయి. ప్రయివేటు ఆస్పత్రుల్లో మాత్రమే ఎక్కువగా సిజేరియన్ కాన్పులు జరుగుతున్నాయి. ప్రసూతి సహాయకులు అందుబాటులోకి వస్తే 99 శాతం సాధారణ కాన్పులు జరిగే అవకాశాలు ఉంటాయి. అలాగే ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది.

- డాక్టర్ బాలకృష్ణనాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి




కాలభైరవ హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న అర్చకులు - పాల్గొన్న అధికారులు, భక్తులు

శాస్త్రోక్తంగా కాలభైరవ హోమం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కాలభైరవ స్వామి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ అవరణలోని ఆంజనేయ స్వామి సన్నిధికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదికలో హోమ పూజలు జరిగాయి. తొలుత కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. కలశ స్థాపన చేసి గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. కాలభైరవుడికి విశేష పూజల అనంతరం కర్పూర హారతులిచ్చారు. కాలభైరవ హోమ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించి, పూర్ణాహుతి సమర్పించారు. గురువారం నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు కామాక్షి అమ్మవారికి చండీ హోమ పూజలు నిర్వహించనున్నారు.దీనికి సంబంధించి యాగశాలలో కలశ స్థాపన ద్వారా అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నం, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అడవిలో ఏకమైన ఏనుగుల గుంపు

● దేవళంపేటలో పంటలపై విచ్చలవిడిగా దాడులు




ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - మామిడిచెట్టు

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కల్యాణి డ్యాంలో సంచరిస్తున్న తొమ్మిది ఏనుగుల గుంపు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోకి మళ్లీ ప్రవేశించాయి. అంతకుముందే అక్కడ తిరుగాడుతున్న ఏడు ఏనుగుల గుంపును కలుసుకున్నాయి. పులిచెర్ల మండలంలో మూడేళ్లగా 17 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ప్రమాదవశాత్తు కట్టమీద నుంచి జారిపడి ఓ ఏనుగు మృతి చెందాక తొమ్మిది ఏనుగులు కల్యాణి డ్యాం వైపు వెళ్లిపోయాయి. అయితే ఆ ఏనుగులు సోమవారం రాత్రి పులిచెర్ల మండలంలోకి చేరుకున్నాయి. అడవిలో సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపులో మంగళవారం రాత్రి కలిసిపోయాయి. దేవళంపేట పంచాయతీలో పంటలపై 16 ఏనుగులు కలిసి విచ్చలవిడిగా దాడులు చేయడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. వ్యవసాయ బోరు మోటర్‌ను ఏనుగుల గుంపు బోరులోకి తోసేయడంతో ఓ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి మంగళవారం రాత్రి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. వెంకటమ్మ చెరువు మార్గంలో పొలాల్లోకి చేరుకుని పంటలపై దాడులు ప్రారంభించాయి. మిట్టమీద రాచపల్లిలోని బసవయ్య, రమణమ్మలకు చెందిన వరి, టమోటా పంటలను ధ్వంసం చేసి, బసవయ్యకు చెందిన వ్యవసాయ బోరు మోటారును సైతం బోరులోకి తోసేశాయి. ఇదే గ్రామంలోని సుధాకర్, రెడ్డెప్పరెడ్డి, గిరిప్రకాష్ రెడ్డి, భాస్కర్, బాలరాజుకు చెందిన మామిడి, కొబ్బరి, వేరుశనగ, వరి, అలసంద పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి తిరిగి గెండేవారిపల్లె వద్దకు చేరుకుని అమరనాథరెడ్డి, రామచంద్రనాయుడుకు చెందిన వరి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేసి రాతికూసాలను విరిచేశాయి. అనంతరం హంద్రీ-నీవా కాలువ మీదుగా అడవిలోకి చేరుకున్నాయి. బుధవారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద 16 ఏనుగుల గుంపు తిష్ట వేశాయని ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు తెలిపారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్ద బసచేయరాదని హెచ్చరించారు.

నేడు ఆరోగ్య శాఖ మంత్రి రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి 11.25 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి పద్మావతి అతిథిగృహం చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. రెండు గంటలకు బాలాజీకాలనీలోని పూలే విగ్రహం వద్దకు చేరుకుని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా నిర్వహించే ఏక్తా యాత్రలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన మదనపల్లెకు వెళతారు.

జీవితంపై విరక్తితో యువతి ఆత్మహత్య



దాక్షాయణి (ఫైల్‌ఫొటో)

తిరుపతి(నేరవిభాగం),(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈస్ట్ డీఎస్పీ భక్తవత్సలం కథనం మేరకు...తిరుపతి తిమ్మినాయుడుపాలెంకు చెందిన దాక్షాయణి(30) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేది. నాలుగేళ్ల క్రితం బంధువైన ఓ యువకుడ్ని ప్రేమించింది. కొద్ది రోజుల తర్వాత వైఖరి మార్చుకుంది. ప్రేమ సంబంధం తెంచుకుంది. దీంతో ఆమెకు తల్లిదండ్రులు పెళ్లి చేయాలనే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈక్రమంలో దాక్షాయణి ఈ నెల 15న ఉద్యోగానికి రాజీనామా చేసింది. తిమ్మినాయుడుపాళెం సమీపంలోని కృష్ణారెడ్డినగర్‌కు వచ్చేసింది. బుధవారం ఉదయం తిరుపతి డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని ఓ రెసిడెన్సీలో రూమ్ అద్దెకు తీసుకుంది. బాత్‌రూంలో ఒంటి మీద డీజిల్ పోసుకుని నిప్పంటించుకుంది. గది నుంచి దట్టమైన పొగలు రావడంతో పక్క రూము వారు గుర్తించి హోటల్ మేనేజర్‌కు చెప్పారు. ఆయన సమాచారంతో ఈస్ట్ ఎస్ఐ చేరుకుని కొన ఊపిరితో పోరాడుతున్న దాక్షాయణిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని రుయాకు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవును చంపిన చిరుత

● భయాందోళనలో పుత్రమద్ది ప్రజలు

ఐరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఐరాల మండలం పుత్రమద్ది వద్ద ఉన్న పసలకొండ రెవెన్యూ గుట్టలో బుధవారం ఓ చిరుత ఆవును చంపి తినేసింది. పుత్రమద్దికి చెందిన మార్కొండయ్య కుమారుడు భాస్కర్‌కు చెందిన ఆవు మేత కోసం గుట్ట ప్రాంతానికి వెళ్లింది. అక్కడ ఆవును చిరుత చంపి తినేసింది. ఈ విషయాన్ని గమనించిన భాస్కరయ్య అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. డీఆర్వో రాకేష్‌కుమార్, ఎఫ్‌బీవోలు లావణ్య, పద్మావతి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డీఆర్వో రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ఆవును అడవి మృగం చంపిందన్నారు. అయితే ఆవు చనిపోయిన ప్రాంతం పూర్తిగా బోధ ఉండటంతో పాదముద్రలు సరిగా పోల్చుకోలేకపోయామన్నారు. ఆవును హైనాగాని, చిరుతగాని చంపి ఉండవచ్చునన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

మహిళకు గాయాలు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని పండారం వీధిలో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ఓ మహిళ గాయాలపాలైంది. ఇల్లు ధ్వంసమైంది. స్థానికుల వివరాల మేరకు.. పండారం వీధిలో భూలోకయ్య, చినపాపమ్మ జీవిస్తున్నారు. ఉదయం ఆమె టీ పెట్టుకోవడానికి గ్యాస్ స్టౌ వెలిగించింది. ఆ సమయంలో భర్త భూలోకయ్య ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్యాస్ సిలిండర్ నుంచి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. చీరకు మంటలు వ్యాపించడంతో ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. అనంతరం ఒక్కసారిగా సిలిండర్ పేలిపోయింది. పండారం వీధిలోని ప్రజలు భయాందోళనకు గురై పరుగులు తీశారు. కొంత సమయానికి తేరుకుని ధ్వంసమైన ఇంటి వెలుపల చినపాపమ్మ మంటలలో ఉన్నట్లు గుర్తించారు. మంటలను అదుపు చేసి, ఆమెను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను రాణిపేట సీఎంసీకి తరలించారు. మొదటి అంతస్తు దెబ్బతింది.

వెంటాడుతున్న చిరుత భయం

● ఆందోళనలో వెటర్నరీ వర్సిటీ వర్గాలు

తిరుపతిరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో చిరుత సంచరిస్తుండడంతో వర్సిటీ అధ్యాపక, ఉద్యోగ, విద్యార్థి వర్గాలు భయాందోళన చెందుతున్నారు. న్యూట్రిషన్ విభాగం, టీవీసీసీ, పందుల పరిశోధన స్థానం, డెయిరీ టెక్నాలజీ కళాశాల వసతిగృహం, ప్రధాన పరిపాలనా భవనం, గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో తరచూ సంచరిస్తుండడంతో ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. ఈ నెల 15న వెటర్నరీ కళాశాల పరిధిలోని యానిమల్ న్యూట్రిషన్ విభాగానికి సమీపంలో పాథాలజీ విభాగం వెనుక వైపు చెట్ల పొదల్లో ఓ ఉద్యోగికి చిరుత కనపించిందన్న ప్రచారం జరిగింది. గతంలో వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట, నిరంతర పశువైద్య విద్య సమాచార కేంద్ర విభాగాలకు సమీపంలోని ప్రహరీపై సంచరించడం తెలిసిందే. అప్పట్లో ఈ విషయం సీసీ కెమెరాల ద్వారా వెలుగుచూసింది. ఈ విషయమై అధికార వర్గాలు డీఎఫ్‌వో సాయిబాబాను కలసి వెటర్నరీ కళాశాల క్యాంటీన్, బాలుర, బాలికల హాస్టల్స్ పరిసరాల్లో బోన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఏఐటీయూసీ సదస్సును జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఈనెల 31వ తేదీన నాడు-నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు అనుసరిస్తున్న విధానాలు - కార్మిక వర్గం సవాళ్లు అనే అంశంపై నిర్వహించనున్న సదస్సులో కార్మిక నాయకులు, మేధావులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, నగర కార్యదర్శి ఎన్.డి.రవి కోరారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 1920 అక్టోబరు 31న ముంబయిలో ఏర్పడిన ఏఐటీయూసీ నేటి వరకు కార్మికుల సంక్షేమం కోసం పోరాటాలు చేస్తూనే ఉందన్నారు.

గరుడ వారధిపై ప్రమాదం : యువకుడి మృతి



మృతి చెందిన రమేష్ రాజు

తిరుపతి(నేర విభాగం) అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : గరుడ వారధిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. జీవకోన పార్వతీనగర్‌కు చెందిన రమేష్‌రాజు (40) కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో తిరుచానూరుకు వెళ్లి వస్తుండగా గరుడ వారధిపై లక్ష్మీపురం సర్కిల్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తలపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఈస్ట్ సీఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి రమేష్‌రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.



సీఆర్ నాయుడు
(ఫైల్ ఫొటో)

సీనియర్ జర్నలిస్టు సీఆర్ నాయుడు కన్నుమూత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):సీనియర్ జర్నలిస్టు చెరుకూరి రంగయ్య నాయుడు అలియాస్ సీఆర్ నాయుడు (82) బుధవారం కన్నుమూశారు.వయోభారంతో,అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా హైదరాబాదులో చికిత్స పొందుతున్న ఆయన బీరంగూడ లోని కుమార్తె హిమబిందు నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాకాల పట్టణం కమతంపల్లెకు చెందిన సీఆర్ నాయుడు ఆంధ్రప్రభ, ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త దినపత్రికల్లో తిరుపతి, బెంగళూరు, చెన్నై కేంద్రాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.గురువారం ఉదయం 10గంటలకు బీరంగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఘాట్‌రోడ్డులో బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో బుధవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. తిరుపతికి చెందిన చంద్రమౌళి బైక్‌లో తిరుమలకు వెళ్తుండగా ఆ ప్రాంతంలో పనులు చేసే కార్మికుడు జితేంద్ర బైక్‌పై ఎదురొచ్చాడు. రెండు బైక్‌లూ ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. భద్రతాసిబ్బంది వారిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. అలిపిరి నుంచి వినాయకుడి గుడిదాకా డబుల్ రోడ్డు ఉంటుంది. తిరుమలకు వెళ్లే వైపున కాకుండా మరోవైపున చంద్రమౌళి ప్రయాణిస్తుండగా అదే మార్గంలో ఎదురొచ్చిన బైక్‌ను ఢీకొన్నాడు.

→ ఘటనా ప్రాంతంలో గాయాలతో జితేంద్ర, చంద్రమౌళి

సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.57 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 64,250

తలనీలాలు సమర్పించినవారు: 25,250



చినుకుల్లో రోడ్డు ఊడుస్తున్న పారిశుధ్య కార్మికులు

తుఫానే తలవంచింది!

ఎడతెరిపి లేని వాన.. ఈడ్చికొడుతున్న ఈదురుగాలులు, వణికిస్తున్న చలి.. ఇటువంటి వాతావరణంలోనూ తిరుమలలో పారిశుధ్య కార్మికులు తమ విధులు యథాతథంగా నిర్వహిస్తున్నారు. పలుచని పాలిథిన్ రెయిన్‌కోట్‌లు ధరించి పనులు చేస్తూ కనిపిస్తున్నారు. ఆలయపరిసరాలు, కాటేజీలున్న ప్రాంతాల్లోనే కాకుండా, నడక దారులు, వేదపాఠశాల, శ్రీవారి పాదాలు మార్గం, పాపవినాశనం మార్గంలోనూ బుధవారం కార్మికులు పనులు చేస్తూ కనిపించారు. టీటీడీ హెల్త్ విభాగంలో 2,152 మంది పారిశుధ్య కార్మికులున్నారు. మూడు షిఫ్టుల్లో వీరు విధులు నిర్వహిస్తుంటారు. తిరుమల పరిశుభ్రత, అందం వీరి శ్రమ సౌందర్య ఫలితమే! మొంథా తుపాను వానలు వీరి విధినిర్వహణ ముందు తలవంచక తప్పలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కాలిబాట మార్గాలను శుభ్రపరుస్తున్న కార్మికులు

917 హెక్టార్లలో పంట నష్టం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో 917 హెక్టార్లలో పంట నష్టం వాటిలినట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభ దశలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపించాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు వరి నాట్లు వేశారన్నారు. విస్తారంగా కురిసిన వర్షాలకు 917 హెక్టార్ల మేర పైరు నీటి మునిగిందన్నారు. పొలాల్లో నీరు బయటకుపోయిన తర్వాత పూర్తి నష్టాన్ని అంచనా వేయగలమన్నారు.

◆ ఎస్వీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీలో

ప్రత్యేక ఫీజు సీట్లకు అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రత్యేక ఫీజుతో అడ్మిషన్లకు అనుమతించారు. ఈమేరకు ఎంటెక్, ఎంఫార్మసీ, బీఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు అవకాశమేర్పడింది. అర్హత,ఆసక్తి ఉన్న విద్యార్థులు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ప్రకటనలో తెలిపారు. ఎంటెక్‌లో ప్రవేశానికి గేట్-2025 మొదటి ప్రాధాన్యత, పీసీ ఈసెట్ -2025 రెండవ ప్రాధాన్యత, బీటెక్ వారికి చివరి ప్రాధాన్యతలో అడ్మిషన్లు ఇస్తారు. ఎంఫార్మసీలో చేరడానికి జీ ప్యాట్-2025 వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్-2025 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, బీఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇస్తారన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఏ.పి.సెట్-2025 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులకు చివరి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎంటెక్ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1,45,170, ఎంఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ. 1, 53,940, బీ ఫార్మసీ ప్రత్యేక ఫీజు సంవత్సరానికి రూ.81 వేలుగా నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. 'ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యూ.ఇన్.డీవోఏ' వెబ్‌సైట్‌లో చూడాలని ఆ ప్రకటనలో సూచించారు.

రక్తమోడుతున్న రైలు పట్టాలు

● ఐదేళ్లలో 436 మంది మృత్యువాత ● ప్రమాదాలు కొన్ని.. బలవన్మరణాలు మరికొన్ని



రైలు పట్టాలపై పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్ ఫొటో)

తిరుచానూరు రైల్వే స్టేషన్ నుంచి.. తిరుపతి వెస్ట్ స్టేషన్ వరకు 12 కిలోమీటర్లు. ఈ మధ్యలో.. ఐదేళ్లలో దాదాపు 436 మంది రైలు పట్టాలపై ప్రాణాలు కోల్పోయారు. ఆందోళన కలిగించే గణాంకాలివీ. ఈ మృతుల్లో.. రైళ్ల నుంచి జారిపడిన వారు, పట్టాలు దాటే సమయంలో రైళ్లు ఢీకొనడం, ఆత్మహత్యలు చేసుకున్న వారున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఐదేళ్లలో మృతిచెందింది: 436 మంది

రైలు నుంచి జారిపడిన ఘటనల్లో: 130 మంది

పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొనడంతో చనిపోయింది: 65 మంది

పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకుంది: 210 మంది

గుర్తు తెలియని వారు: మరో 31 మంది

● రెండు రోజుల క్రితం తిరుపతి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నెంబరు 5లో తిరుపతి-కొల్హాపూర్ వెళ్లే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ కదులుతుండగా 45 ఏళ్ల వ్యక్తి రైలు ఎక్కుతున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి రైలుకు, ప్లాట్‌ఫారానికి మధ్యలో పడి శరీరం రెండు ముక్కలై మృతి చెందాడు.

● తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి రేణిగుంట రైల్వే స్టేషన్ మధ్య రిలయన్స్ అండర్ బ్రిడ్జి సమీపంలో 50 సంవత్సరాల వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

ఈ రెండూ మచ్చుకు ఉదాహరణలే. తిరుచానూరు.. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ మధ్య తరచూ ఎక్కడో ఒక చోట రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఉంటున్న జనరల్ బోగీల్లో ఫుట్‌పాత్‌పై ప్రమాదకర పరిస్థితుల్లో కూర్చున్న వారిలో పలువురు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందుతున్నారు. ఇంకొందరు ప్రయాణికులు పట్టాలు దాటే సమయంలో.. రైలు దగ్గరకు వచ్చే సరికి వెళ్లిపోవచ్చని అనుకుంటారు. ఇలా పలువురు ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటుతూ మృతి చెందుతున్నారు. పూర్ణకుంభం సమీపంలోని రైల్ ఓవర్ బ్రిడ్జి వద్ద.. అటు పద్మావతి మహిళా వర్సిటీ సమీపంలో.. మరోవైపు స్టేషన్‌లో రైలు షంటింగ్ చేసే సమయంలో ఎక్కువగా చనిపోతున్నారు. ప్రతి నెలా సగటున 5 నుంచి 8 మంది వివిధ కారణాలతో మృత్యువాతపడుతున్నారు. ఇలా ఐదేళ్లలో 436 మంది చనిపోగా.. వీరిలో 31 మంది గుర్తు తెలియని వ్యక్తులే. వీరి వివరాలు తెలియక అనాధ శవాలుగా ఖననం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైలు ప్రమాదాల నివారణలో భాగంగా రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ పోలీసులు, సంయుక్తంగా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నాం. రైలు వచ్చే సమయంలో మైకు ద్వారా అప్రమత్తం చేస్తున్నాం.

- ఆశీర్వాదం, రైల్వే సీఐ



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సందర్భంగా బుధవారం రిజర్వుడ్ గ్రౌండులో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం పోలీసు శాఖ ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, భద్రతా పరమైన సాంకేతిక వ్యవస్థలను వారు ఆసక్తిగా తిలకించారురు. అమరవీరుల త్యాగాలకు వారు నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ భక్తి, సేవాస్ఫూర్తిలను పెంపొందించడం పోటీల ఉద్దేశమని చెప్పారు. అమర వీరుల త్యాగాలను భావి తరాలకు తెలియచేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత, సీఐ తమీమ్ అహ్మద్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు బుచ్చినాయుడు కండ్రిగ మండలం కారణిమిట్టలో నీట మునిగిన వరిచేలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. పంటలతో పాటుగా ఎంత మేర నష్టం వాటిల్లిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా పంపిణీ సజావుగా సాగుతోందా అన్ని రైతులను అడిగారు. తమకు ఇస్తున్న యూరియా చాలడం లేదని రైతులు చెప్పారు. తెగిన చెరువులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. నారాయణవనం మండలం తుంబూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాధితులకు నగదు, సరుకులు అందజేశారు. వెదర్లకండ్రిగలోని పునరావాస కేంద్రాన్నీ పరిశీలించారు.



కారణిమిట్టలో వరిపంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పూడి రైల్వేలైన్‌కు 6.5 ఎకరాలు గుర్తించాం

● అమ్మవారిపట్టెడలో రైతులతో ఆర్డీవో సమావేశం



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రేణిగుంట అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి):పూడి రైల్వే లైన్ కోసం భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి సమావేశమయ్యారు. బుధవారం మండల పరిధిలోని అమ్మవారి పట్టెడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పూడి రైల్వే లైన్ నిర్మాణానికి గ్రామంలోని రైతులకు చెందిన 6.5 ఎకరాలను గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన 29 రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, డీటీ శ్యాం ప్రసాద్, ఆర్ఐ జైకృష్ణ, సర్వేయర్ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.





వసంత మండపంలో మన్ను సేకరిస్తూ.. - విష్వక్సేనుడికి హారతులిస్తున్న అర్చకులు

పుష్పయాగానికి అంకురార్పణ

తిరుమల, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం జరగనున్న పుష్పయాగానికి బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు ముందు ఆచార్య ఋత్విక్‌వరణం నిర్వహించారు. అర్చకులకు విధుల కేటాయింపునే ఋత్విక్‌వరణం అంటారు. ఇందులో వైదిక కార్యక్రమాల నిర్వహణకోసం ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. సాక్షాత్తు శ్రీవారి ఆజ్ఞ మేరకు విధులు పొందినట్టు అర్చకులు భావిస్తారు. ఇక, రాత్రి 7 గంటలకు శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయం నుంచి వసంతమండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. 8 నుంచి 9 గంటల నడుమ ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ జరిగింది.

నేడు పుష్పయాగం: శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు కల్యాణమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు రకాల పత్రాలు, 12 రకాల పుష్పాలతో (సుమారు 9 టన్నులు) ఉత్సవర్లకు పుష్పయాగం నిర్వహిస్తారు.

రైతుల పరిస్థితి దయనీయం

● ముక్కంటి ఆలయంలో అవినీతి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



సమావేశంలో మాట్లాడుతున్న చింతా మోహన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): దేశంలో పరిశ్రమలకు కల్పిస్తున్న సదుపాయాలను రైతులకు ఇవ్వడం లేదని దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 11 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యమన్నారు. యూపీయే హయాంలో రూ.70వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అదానీకి భూములు, విమానాశ్రయాలు ఇస్తారు కానీ రైతులకు ఏం ఇచ్చారని ప్రశ్నించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.22వేల కోట్లు రాయితీ ఇచ్చారని, రైతు బిడ్డ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు ఏం చేశారన్నారు. యూపీఏ హయాంలో శ్రీసిటీ, మేనకూరు సెజ్, కృష్ణపట్నం పోర్టు తెచ్చామన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు రూ.14.50 లక్షల కోట్ల రుణమాఫీ చేశాయని, ఎవరికి ఎంత మాఫీ చేశారో ప్రధాని మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్, సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. తమ హయాంలో మన్నవరంలో భెల్ పరిశ్రమకు పునాదిరాయి వేయగా నేడు అనాది రాయిగా మిగిలిందన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెప్పులు, సెల్‌ఫోన్ స్టాండ్, కారు పార్కింగ్‌లో అవినీతి చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 వేల ఎకరాల భూములను స్వాహా చేశారని సీఎం, కలెక్టర్ జోక్యం చేసుకుని ఆక్రమణలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, సమీవుల్లా, రవి, జనార్దన రెడ్డి, శివయ్య, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ విధుల్లో అలసత్వం..

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

తడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ విధుల్లో అలసత్వం వహించిన మరో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ అయ్యింది. సోమవారం రాత్రి కారూరు సచివాలయ పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు తుఫాన్ విధులు నిర్వహించడంలో అలసత్వం వహించారని అధికారుల పరిశీలనలో తేలింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ తహసీల్దారు శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. కాగా, ఇప్పటికే పెరియవట్టు, పూడి, అండగుండాల, సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి.

డీ-ఎడిక్షన్ కేంద్ర విస్తరణ యోచన

● పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రవికృష్ణ

తిరుపతి(వైద్యం), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని మత్తు వ్యసన నిర్మూలన కేంద్రాన్ని(డీ-ఎడిక్షన్ కేంద్రం) 60 పడకలతో విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఏ.రవికృష్ణ చెప్పారు. ఈ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ తిరుపతితోపాటు విశాఖపట్నం, కర్నూలు జిల్లాల్లోని కేంద్రాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తున్నామన్నారు. మత్తు వ్యసనాల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రలను బాధితులు వినియోగించుకోవాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురితో ఆయన మాట్లాడారు. సదుపాయాల గురించి ఆరా తీశారు. చికిత్సా విధానాలను పరిశీలించారు. రాష్ట్రంలో గంజాయి విక్రయాలను చాలా వరకు అరికట్టామని ఐజీ చెప్పారు. విద్యార్థులకు,యువతకు అవగాహన కల్పించి గంజాయి జోలికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇక్కడి కేంద్రంలో అందిస్తున్న చికిత్సలు, కౌన్సెలింగ్ పద్ధతుల గురించి ఎస్పీ సుబ్బరాయుడు ఆయనకు వివరించారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ రాధ, ఏఎస్పీ రవిమనోహరాచారి, ఏఆర్ఎంవో హరికృష్ణ, డిఐవో హరిప్రసాద్, మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం విభాగాధిపతి డాక్టర్ పద్మావతి, మెడికల్ ఆఫీసర్ మానస, కౌన్సలర్లు మురళీ, ఈగల్ టీం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగుల వివరాలు పరిశీలిస్తున్న ఐజీ రవికృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేసినట్లు మంగళం డిపో మేనేజర్ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, పంచరామారాలు, మొగిలి, శ్రీకాళహస్తి, తిరువణ్ణామలై, కోటిలింగాలు, గుడిమల్లం, ముక్కోటి ఆలయాల సందర్శనకు బస్సులు కేటాయించామని పేర్కొన్నారు. వివరాలను గురువారం ఆన్‌లైన్‌లో ఉంచుతామని, భక్తులు ముందస్తుగానే టిక్కెట్ పొందవచ్చని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7893723453, 8247687578లను సంప్రదించాలని కోరారు.

యాచవరం సొసైటీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు

బాలాయపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు... మండలంలోని అక్కసబముద్రం గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 178లో 4.60 ఎకరాలను యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన వరికూటి అన్నపూర్ణ ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్నారు. ఆ భూమిని ఆక్రమించుకునేందుకు వెంగమాంబపురం గ్రామానికి చెందిన యాచవరం సొసైటీ అధ్యక్షుడు సీసీ నాయుడు ఎక్స్‌కవేటర్, డోజర్లతో చదును చేస్తుండగా అన్నపూర్ణ తన మరిది జయరామయ్యతో కలిసి అడ్డుకున్నారు. ఈ క్రమంలో సీసీ నాయుడు దాడి చేసి కులంపేరుతో దూషించాడని అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పద్మావతి వర్సిటీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో నాలుగు రోజుల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ చేపట్టింది. విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించడం, ప్లేస్‌మెంట్ అవకాశాలకు సిద్ధం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇన్ఫోసిస్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ పూర్తి అయిన తర్వాత క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కూడా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ప్రారంభించగా, సైన్స్ డీన్ సుధా నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

ఊపిరి పీల్చుకున్న అధికారులు

సాధారణ పనుల్లో నిమగ్నం



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో రెండు రోజులుగా పుత్తూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో ప్రజలు, అధికారులు భయంభయంగా గడిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సచివాలయం, పోలీస్, అగ్నిమాపక శాఖ, మున్సిపాలిటీ సిబ్బందికి లోతట్టు ప్రాంతాల్లో విధులు కేటాయించారు. ఉప్పువంకలో నీరు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలతో అప్రమత్తంగా వ్యవహరించారు. మంగళవారం రాత్రి నుంచి తుఫాను తీరం దాటిందని తెలిసి అధికారులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. సాధారణ విధుల్లో భాగంగా బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అంతే కాకుండా తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిని కమిషనర్ అభినందించారు.

పాలిటెక్నిక్‌తో చెన్నై కంపెనీ ఎంవోయూ



అవగాహన ఒప్పంద పత్రాన్ని ప్రదర్శిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పుత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌తో చెన్నైకి చెందిన డెల్ఫీ టీడీఎస్ కంపెనీ బుధవారం ఎంవోయూ కుదిరింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ... నైపుణ్యం, శిక్షణ, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఒప్పందంపై కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగరాజన్ సంతకం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణాధికారి వేలాయుధ ఆచ్చారి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

1నుంచి కల్యాణ వెంకన్న కార్తీక తెప్పోత్సవాలు

నారాయణవనం, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువై ఉన్న పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు నవంబర్ 1వ తేది నుంచి 5 రోజులు పాటు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు తామర గుంట పుష్కరిణి చుట్టూ శుభ్రం చేసి, విద్యుత్ దీపాలు, కటౌట్లను ఏర్పాటు చేశారు. నవంబర్ 1 తేది శనివారం రాత్రి సీతాలక్ష్మణ సమేత రామచంద్ర మూర్తి, 2వ తేది అండాల్ అమ్మవారు, 3, 4, 5 తేదిల్లో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న తెప్పలపై విహరిస్తారని ఆలయ పర్యవేక్షకుడు నాగరాజు తెలిపారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ ప్రతి అందజేత



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ ప్రతిని చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు, వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్ తదితరులు తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్వరలోనే రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం ఏర్పాటు చేసి పనులపై సమీక్షిస్తామన్నారు.

షరీఫ్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



షరీఫ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలుడిని కాపాడబోయి తెలుగుగంగ కాలువలో కొట్టుకుపోయి మృతి చెందిన వరదయ్యపాళెంకు చెందిన కారు డ్రైవర్ షరీఫ్ (చిట్టి) కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. షరీఫ్ కుటుంబీకును బుధవారం ఉదయం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా షరీఫ్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆదిమూలం రూ.45 వేల ఆర్థికసాయంతో పాటు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. అలాగే రాచర్ల గ్రామానికి చేరుకుని అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త కడివేటి కిషోర్‌ను పరామర్శించి, రూ. 10వేలు ఆర్థిక సాయం చేశారు. జయశంకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసులు నాయుడు, నంద పాల్గొన్నారు. అలాగే ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులు తమ వంతు సాయంగా రూ.30 వేలు అందించారు. మురళి, ఆర్.కే.శీను, చందు, దయాల్‌నాయుడు, ఎర్రమల్లి, మునెయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ' కుట్టు మెషిన్ల పంపిణీ



సత్యవేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు కుట్టు మెషిన్లు పంపిణీ చేశారు. బుధవారం సత్యవేడు పట్టణంలోని ప్రధాన పోస్టాఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన తపాలా అధికారి మనోహర్ ఆధ్వర్యంలో 70 మందికి పంపిణీ చేశారు. వరదరాజులు, నరేంద్ర పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు సాయికుమార్

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయికుమార్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 24న మదనపల్లిలో జరిగిన హ్యాండ్‌బాల్‌లో జిల్లాస్థాయి పోటీల్లో సాయికుమార్ ప్రతిభ కనబరిచాడు. దీంతో నవంబరు 1న తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్‌ఎం రమణయ్య, పీడీ మస్తాన్ విద్యార్థిని అభినందించారు.

భక్తులను ఇబ్బంది పెడితే చర్యలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భక్తులను ఇబ్బందిపెడితే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ ప్రకాష్ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయం నాలుగవ గేటు వద్ద యాచకులు భక్తులను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఆలయ పరిసరాల్లో యాచకులను 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

షార్ రోడ్డులో ఒరిగిపోయిన లారీ



సూళ్లూరుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డులో షార్ బస్సుల గ్యారేజ్ వద్ద సిమెంట్ లోడుతో వెళ్తున్న ఓ లారీ రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులకు వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ లారీని రోడ్డు పక్కన ఆపేందుకు డ్రైవర్ దారి అంచుకు వెళ్లగానే వర్షాలకు సైడ్ బర్మర్ తడిగా ఉండడంతో టైర్లు కుంగిపోయి పక్కకు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.





గుర్రపుడెక్కతో నిండిపోయిన దూడలకాలువ - చల్లకాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపుడెక్క

వరద పారే దారేదీ?

- కాలువల నిండా గుర్రపుడెక్క
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- నివాస గృహాల్లోకి వర్షపునీరు

గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ల సమయంలో వరదనీరు గూడూరు పట్టణాన్ని చుట్టుముట్టకుండా సజావుగా ముందుకు సాగేలా పలు కాలువలు ఉన్నాయి. ఇందులో పంబలేరువాగు, చల్లకాలువ, దూడల కాలువ ప్రధానమైనవి. వీటిల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది. మొంథా తుఫాను ప్రభావంతో 24 గంటల పాటు ఎడతెరపిలేకుండా మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం లేకపోవడంతో కాలువల్లో నీటి ప్రవాహం సైతం తక్కువగా ఉంది. గూడూరు పరిసర ప్రాంతాల్లో పడిన వర్షపునీటితో వెంకటగిరి కైవల్యానది పొంగితే వచ్చే వరద, కండలేరు జలాశయం నుంచి విడుదల చేస్తే వచ్చే నీరంతా పట్టణంలోని పంబలేరు, చల్లకాలువ, దూడల కాలువల ద్వారా ప్రవహించి పురిటిపాళెం సమీపంలోని పంబలేరు వాగులోకి చేరుకుని చిల్లకూరు మండలం తిప్ప గుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరులో కలసి, అక్కడ నుంచి గుమ్మళ్లదిబ్బ సముద్రంలోకి చేరుతుంది. అయితే చల్లకాలువ, దూడలకాలువలలో గుర్రపుడెక్క పేరుకుపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. చల్ల కాలువను ఆనుకుని జనార్దనరెడ్డికాలనీ, సాదుపేట, దూర్జటినగర్, దూడల కాలువను ఆనుకుని విఘ్నేశ్వరపురం, ఆర్టీసీ బస్టాండు, బాలాజీ నగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ కాలువల్లో గుర్రపుడెక్కను తొలగించకపోతే వరద ఉధృతి పెరిగితే కట్టలు దెబ్బతిని నివాసగృహాల్లోకి నీరు చేరుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి చల్లకాలువ, దూడలకాలువలో గుర్రపుడెక్క తొలగించి, నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తుంబూరు కాజ్‌వేకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్



బాధితులకు నగదు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

నారాయణవనం, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంబూరు కాజ్‌వే సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన నారాయణవనంలోని తుంబూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాధిత కుటుంబానికి రూ.3 వేలు, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వెదర్లకండ్రిగలోని ఎస్టీ కాలనీకి చెందిన 16 కుటుంబాలకు సమీప పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని, డ్రైనేజీ కాలవలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రోజారాణి, డిప్యూటీ తహసీల్దార్ భానుచందు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే సుధీర్ పరామర్శ



నిత్యావసరాల పంపిణీలో ఎమ్మెల్యే తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి గిరిజనకాలనీలో తుఫాన్ బాధితులను ఎమ్మెల్యే సుధీర్ పరామర్శించారు. తుఫాన్ ప్రభావంతో పలువురి గుడిసెలు నేలమట్టమయ్యాయి. అంతే కాకుండా పలు గుడిసెలు ఉరుస్తున్నాయి. ఈ క్రమంలో గుడిసె వాసులను మంగళవారం దుర్గిపేరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. బుధవారం ఎమ్మెల్యే పునరావాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. వారికి నిత్యావస సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. తుఫాన్‌బాధితుల వివరాలు సేకరించి వారికి పక్కాగృహాలు నిర్మించి ఇస్తామన్నారు. తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ధనంజయలునాయుడు, పొన్నారావు, నాగరాజునాయుడు, మహేష్‌రెడ్డి, గుణయాదవ్, మునెయ్య, హరి, సుబ్రహ్మణ్యంరెడ్డి, జైచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరామర్శ



కుక్కంబాకంలో చెరువు నీటిని పరిశీలిస్తున్న శంకర్‌రెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):వర్ష బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి చెప్పారు. వర్షాలకు దెబ్బతిన్న వరిని టీడీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కుక్కం బాకంలోని భైరవవానిగుంట చెరువుకు పడిన గండితో గ్రామంలోకి వస్తున్న నీటిని, కారణిమిట్టలో నీట మునిగిన వరిని పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, కాటూరు సహకార సంఘ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మునిచంద్రనాయుడు, కార్తిక్, మధునాయుడు, మనోహర్, మునెయ్య, వీరరాఘవులు పాల్గొన్నారు.

శాశ్వత వంతెన నిర్మిస్తాం

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన ప్రతి సారీ వర్షాలకు కొట్టుకుపోతోందని దాని స్థానంలో శాశ్వత వంతెన నిర్మిస్తామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త శంకర్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి మండలంలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం క్రితం శాశ్వత వంతెన నిర్మాణ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రూ.5కోట్లతో వంతెనను త్వరలో చేపడుతామని చెప్పారు. మునస్వామియాదవ్, ప్రకాష్‌నాయుడు, లోకనాయుడు, లోకేష్‌బాబు, వాసు, వెంకటకృష్ణయ్య, సర్పంచ్ వెంకటేష్, తహసీల్దారు రోశయ్య పాల్గొన్నారు. అలాగే కొటాలమిట్టకు కూడా త్వరలో తాత్కాలిక వంతెన నిర్మిస్తామని శంకర్‌రెడ్డి చెప్పారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలో అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వాణి, చంద్రబాబుకు శంకర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్ నుంచి చుక్క నీరు కూడా వృథా కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జల వనరుల శాఖ ఇంజనీర్లను టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రాం కమిటీ సమన్వయకర్త శంకర్‌రెడ్డి కోరారు. బుధవారం సాయంత్రం టీడీపీ నాయకులు, ఇంజనీర్లతో కలసి ప్రాజెక్టును పరిశీలించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడు, సురుటుపల్లి ఆలయ కమిటీ చైర్మన్ పద్మనాభరాజు, తిరుమలరెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పంబలేరు వాగు



గూడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షంతో పట్టణంలోని పంబలేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పై ప్రాంతాల్లో పడిన వర్షంతో పాటు కైవల్యానదిలో వరద, కండలేరు జలాశయం నుంచి విడుదల చేసే నీరు పలు కాలువలు, వాగుల ద్వారా ప్రవహించి గూడూరులోని పంబలేరు వాగులో కలుస్తుంది. అక్కడ నుంచి చిల్లకూరు మం డలంలోని సముద్రతీరంలో కలిసిపోతుంది. పంబలేరువాగులో ఉధృతంగా సాగుతుండడంతో చప్టాపై బుధవారం వరదనీరు ప్రవహించింది.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే పర్యటన



అబ్బాబట్లపల్లిలో పర్యటిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు పర్యటించారు. మండలంలోని అబ్బాబట్లపల్లి అరుంధతివాడు, ముళ్లపూడి ఎస్టీకాలనీ, పోలి ఎస్టీకాలనీల్లో ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దుప్పట్లు పంపిణీ చేశారు. బర్రె హేమభూషణ్‌రెడ్డి, చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, వి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

త్రిమూర్తుల సేవలో ఐజీ రవికృష్ణ



ఏర్పేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): త్రిమూర్తుల ఆలయంగా గుర్తింపు పొందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని బుధవారం ఐజీ(ఈగల్) రవికృష్ణ దర్శించుకున్నారు. ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు వారికి ఆలయ మర్యాదలతోస్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చివోలుకి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు ఎం.రంగయ్య సతీమణి గంగమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తొలగిన తుఫాన్ ముప్పు

యథావిధిగా జనజీవనం

తడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ప్రజలను భయాందోళనకు గురిచేసిన మొంథా తుఫాన్ ముప్పు తొలగింది. నాలుగు రోజులుగా వర్షాలతో ఇబ్బందులు పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి మొంథా తుఫాను తీరం దాటడంతో వర్షం ఆగిపోయింది. బుధవారం ఉదయం ఎండ కాయడంతో జనజీవనం సాధారణ స్థితికి వచ్చింది. కాగా, చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో మత్స్యకార కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీకి మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. తుఫాన్ కారణంగా రామాపురంలో మూడు పూరిగుడిసెలు, పెరియవట్టులో ఒక పూరిగుడిసె పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండు రోజులుగా ఇరకం, బీవీపాళెం మధ్య నిలిచిపోయిన పడవ ప్రయాణాలు బుధవారం యథావిధిగా సాగాయి.

రబీ సీజన్‌కు అందుబాటులో యూరియా



యూరియా బస్తాలను చూపుతున్న భాస్కర్ తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండల రైతులకు రబీ సీజన్‌కు సంబంధించి యూరియా అందుబాటులో ఉందని తంగేళ్లపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్ తెలిపారు. ఎకరాకు 3 బస్తాల చొప్పున మూడు విడతలుగా ఇస్తారన్నారు. వ్యవసాయ శాఖ జారీ చేసిన కార్డు తీసుకువచ్చి యూరియాను తీసుకోవచ్చన్నారు. డైరెక్టర్లు బత్తెయ్య, ధనంజయులు, సీఈవో చిరంజీవిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అభినందన



ఉపాధ్యాయులకు సేవా పుస్తకాలు అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా నూతనంగా ఉపాధ్యాయులుగా నియమించిన 22మందికి ఏపీటీఎఫ్ సేవా పుస్తకాలను జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో బాధ్యతగా వ్యవహరించాలని, హక్కుల కోసం పోరాడలన్నారు. పట్టణ అధ్యక్షుడు గోపాల్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటాద్రి, సుధాకర్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వారణాసిలో శ్రీకాళహస్తీశ్వరుడి కల్యాణోత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వారణాసి క్షేత్రం కాశీ విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం కల్యాణ ఘట్టం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పునీతులయ్యారు. ఆలయ అధికారి విజయసారథి, వేదపండితులు త్రినాధస్వామి, మారుతీరామ్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితాలు చిత్తు చేసుకోవద్దు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐజీ రవికృష్ణ, ఏఎస్పీ రవి మనోహరాచారి

ఏర్పేడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై జీవితాలను చిత్తు చేసుకోవద్దని ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. మండలంలోని పాపానాయుడుపేటలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మత్తు వ్యసనపరుల పునరావాస కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చికిత్స పొందుతున్న వారికి పలు సూచనలు చేశారు. మత్తు వదిలితేనే ఆనందమయ జీవితం ఉంటుందని, భార్య, బిడ్డలతో జీవితాన్ని గడపగలుగుతారని తెలిపారు. ఏఎస్పీ రవి మనోహరాచారి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి, రాస్ మత్తు వ్యవసనాల పునరావాస కేంద్రం సీఈవో అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుడి సేవలో జ్యోతుల నెహ్రూ



నాగలాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయాన్ని బుధవారం టీటీడీ పాలకమండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ ఈవో లత, ఆలయ పాలకమండలి చైర్మన్ పద్మనాభరాజు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం పల్లికొండేశ్వరుడి సన్నిధిలో ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి జ్ఞాపికను అందించారు. ఆలయ పాలకమండలి సభ్యుడు హంస రుద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపాళెం నిరాశ్రయులను ఆదుకోండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వర్షాలకు నిరాశ్రయులైన చల్లపాళెంవాసులను ఆదుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య డిమాండ్ చేశారు. చల్లపాళెంలో దెబ్బ తిన్న ఇళ్లను బుధవారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. సీపీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల ద్వారా బాధితులను కొంతమేర ఆదుకున్నామన్నారు. కలెక్టర్ స్పందించి దెబ్బతిన్న ఇళ్లకు రూ.50వేలు మంజూరు చేయాలన్నారు.

వీరభద్రుడి ఆలయంలో బాలాలయం

నారాయణవనం, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం పునః నిర్మాణం కోసం గతంలో టీడీపీ అధికారులు నిధులు మంజూరు చేశారు. ఆలయ పునః నిర్మాణ పనులను సంబంధించి బాలాలయం పనులు పూర్తయ్యాయి. బుధవారం ఆలయంలో యాగశాల పూజ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులందరికీ ఆధార్‌కార్డులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులందరికీ ఆధార్ కార్డులు తీయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇంకా 80 మంది విద్యార్థులకు కొత్త ఆధార్ కార్డులు తీయాలన్నారు.

అభివృద్ధికి దూరం... నారాయణపురం!

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణానికి నారాయణపురం పంచాయతీ కూతవేటు దూరంలో ఉంది. అటు ఎమ్మెల్యే స్వగ్రామం ఊరం దూరు.. ఇటు నారాయణపురం పంచాయతీ.. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయాల్సిన చోట్ల చోటా మోటా నాయకుల సమన్వయ లోపంతో అభివృద్ధికి దూరమైంది. పంచాయతీ పరిధిలో జింగిలిపాళెం, విశాలాక్షి కాలనీ, పెంకులపాడు గ్రామాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి నారాయణపురం అభివృద్ధికి తోడ్పడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


నారాయణపురంలో అధ్వానంగా మారిన రోడ్లు

ముక్కంటి సేవలో రాష్ట్ర రెవెన్యూ ఎండోమెంట్స్ సెక్రటరీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం రెవెన్యూ ఎండోమెంట్స్ సెక్రటరీ డాక్టర్ హరి జవహర్‌లాల్ దర్శించుకున్నారు. ఆయనకు ధర్మకర్తల మండలి ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన గోపూజ, సుప్రభాతం, స్వామిఅమ్మవార్ల అభిషేక సేవల్లో పాల్గొన్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామిసన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

శాస్త్రోక్తంగా వరదరాజస్వామి విగ్రహ జలధివాసం

శ్రీకాళహస్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీ శ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న వరద రాజ స్వామి ఆలయంలో బుధవారం అత్తి వరదరాజ స్వామి విగ్రహ జలధి వాసం శాస్త్రోక్తంగా జరిగింది. అగ్ని ప్రతిష్ఠాపనం, కుంభారాధనం జరిగాయి. వేదపండి తులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ సాయి ప్రసాద్ పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే సుధీర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా గురు వారం ఉదయం 7గంటలకు అగ్నిప్రణయనం, కుంభారాణం, సాయంత్రం 5గంటలకు మహాశాంతి అభిషేకం, శుక్రవారం ఉదయం అగ్నిప్రణయనం, కుంభారాధనం, సర్వగాయత్రి హోమం జరగనున్నాయి.


విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు

శ్రీకాళహస్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయాల సందర్శనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు బుధవారం తెలిపారు. నవంబరు 3, 10, 17 తేదీల్లో ఉదయం 5గంటలకు శ్రీకాళహస్తి బస్టాండు నుంచి గుడిమల్లం, అప్పలాయగుంట, వకుళ మాత ఆలయం, ముక్కోటి, తలకోనకు వెళ్లి సాయంత్రం 5గంటలకు డిపోకు చేరుకుం టుందన్నారు. రానుపోను రూ.450 మాత్రమే అని తెలిపారు. ఆన్‌లైన్‌లో కానీ, బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు నెం.7382880178, 7282881715లలో సంప్రదించవచ్చన్నారు. ప్రతి నెలా పౌర్ణమికి శ్రీకాళహస్తి నుంచి తిరువణ్ణామలైకు బస్సులు నడుపుతామన్నారు.

మల్లిమడుగు డ్యాం గేట్ల మూసివేత

రేణిగుంట, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు డ్యాం గేట్లను అధికారులు మూసివేశారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు డ్యాం నిండింది. దీంతో 6 గేట్లను అడుగు పైకెత్తి రెండు రోజులుగా నీటిని కిందకు విడుదల చేసిన విషయం విదితమే. ఈక్రమంలో బుధవారం వర్షం కురవక పోవడంతో 6 గేట్లను మూసివేశారు. ప్రస్తుతానికి డ్యాం నిండుకుండను తలపిస్తుంది.

తాగొద్దని మందలించిన తల్లి యువకుడి ఆత్మహత్య

రేణిగుంట, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గాజుల మండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. సీబీడీ కాలనీలో నివాసముంటున్న షేక్ అబ్బాస్ (23) మద్యానికి బానిసయ్యాడు. దీంతో తల్లి మందలించడంతో మంగళవారం అర్ధరాత్రి అర్ధరాత్రి ఉరివేసుకున్నాడు. బంధువులు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని రూయా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

ఎంపీ రమేష్‌కు సాదర స్వాగతం



రేణిగుంట అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ రైల్వేస్ ఛైర్‌పర్సన్ సీఎం రమేష్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఢిల్లీ నుంచి బుధవారం సాయంత్రం విమానాశ్రయం చేరుకున్న ఆయనకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, తదితరులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.